# దయ్యం

[గల్పిక]

అక్కడ దయ్యం ఉండేది, అందుకని ఆఇల్లు పాడుపెట్టారు.

ఆ ఇంటో రాధ తల్లి చచ్చిపోయింది. రాధ తల్లి దయ్య మయిందని అందరికీ తెలుసును. కాని, అంత మహాఇల్లాలును దయ్య మనటాని కెవరికీ నోరు రాలేదు.

రాధకు దయ్యమంటే భయమే. ఆ ఇల్లంటేనూ భయమే. ఆ ఇంటో ఉన్న దయ్యం పొరుగింటి మహాలక్ష్మమ్మకు పట్టి నప్పుడు మహాలక్షమ్మనుచూసి రాధ భయపడి, ఒక రోజల్లా మూసిన కన్నెరగదు.

కాని, ఆ ఇంటోనే ఉంది అమ్మ. "అమ్మేదే" అని తను యేడ్చినప్పుడు, "ఆఇంటోఉందమ్మా?" అనిఅమ్మమ్మ చెప్పలా అయితే ఆ ఇంటోనే దయ్యం ఉ ది కదా, అమ్మకు భయం కాదూ?అన్నట్టు అమ్మకు భయంలేదు. తనకు చీకట్లో పోవ టానికి భయం వేస్తే అమ్మ తోడు వచ్చేదికాదూ?

రాధకుఒక్కసారి అమ్మను చూడాలనిపించింది. ఎవరన్నా చూస్తే కోప్పడతారు. అందుకని రాధ ఒకనాడు, ఒకరాత్రి వేళ అమ్మఉన్నఇంటికి, దయ్యంఉన్నఇంటికి, బయలుదేరింది.

బిక్కుబిక్కుమనే ఆ ఇంటో అడుగు పెట్టినప్పుడు రాధకు భయం వెయ్యలేదు. "అమ్మా!" అని పిలిచింది.

జవాబు రాకపోవటంచూసి, "నువ్వు లోపల లేవుటే అమ్మా!" అన్నది రాధ, అనుమానంతో.

"నాకోసం వచ్చావుటే, నాతల్లీ?" అన్నది రాధ.

"నీకోసం వచ్చానే!" అన్నది రాధ.

"నేను నీ కోసం కనిపెట్టుకున్నానే!" అన్నది రాధ.

"ఇన్ని రోజులు నాకు కనపళ్లేదేమే, అమ్మా?" అన్నది రాధ.

"నేను నీ కోసం ఇక్కడే ఉన్నానే!" అన్నది రాధ.

"నేను నీదగ్గిర పడుకోవద్దుటే, అమ్మా?" అన్నదిరాధ.

"నిన్ను నిద్రపుచ్చుతాను రావే, తల్లీ!" అన్నది రాధ.

మర్నాడు రాధకోసం అందరూ వెతికారు. ఆ దయ్యాల కొంపలో కటిక నేలమీద, ఆ దుమ్ములో బోర్లా పడుకుని గాఢ నిద్రలో కనిపించింది రాధ.

రాధను లేపి వాళ్లవాళ్లు, అక్కణ్ణించి తీసుకుపోయినారు.

"నేనమ్మదగ్గిర పడుకున్నానే? నేనమ్మదగ్గిరే ఉంటానే!" అని మూడేళ్ల రాధ పెనుగులాడింది.

"అయ్యో, ఇంకేమమ్మే! మీ అమ్మ చచ్చిపోయి దయ్యమయిందే!" అన్నారు రాధ బంధువులు.

రాధ అకారణంగా ఏడవటం మొదలుపెట్టింది. ఏంచేసినా ఆ ఏడుపు పోలేదు. అందర్నీ కొట్టటం మొదలుపెట్టింది. ఎవర్తో మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టింది.

రాధకు దయ్యం పట్టిందన్నారు. వీభూది పెట్టించారు. ముగ్గులు వేయించారు. రాధ పోరు మానలేదు. తనకు చికిత్స చెయ్యటానికి వచ్చినవాళ్ళమీదా తన తల్లిని దయ్యమన్నవాళ్లమీదా రాధ నిప్పులు కక్కేది, పళ్లు పటపటా కొరికేది, ఏది దొరికితే అది వాళ్లమీద గిరాటు వేసేది.

వారంరోజుల్లో రాధ చిక్కి శల్యమయి మంచం పట్టింది.
రాధ గొంతు వెలుగురాకుండపోయింది. హీనస్వరం పడ్డది.
రాధ మంచినీళ్లుకూడా ముట్టటం మానేసింది.

మరో నాలుగయిదురోజులకు రాధ అంతరించింది.

రాధను తల్లి దయ్యమైపట్టి తీసుకుపోయిందని అంతా అనుకున్నారు.

---

## భూతదయ

(అల్పిక)

రాజుగారి కొలువులో నిండుసభలో అహింసను గురించిన చర్చ వచ్చింది.

ఇద్దరు ప్రజ్ఞావంతులు చెరోపక్షాన తగులుకునేప్పటికి మిగిలిన వారంతా విరమించి వినోదం చూడసాగారు.

బక్కవాడైనా అహింసకూడదని ఘట్టిగావాదిస్తున్నాడు ఒకడు; బలవంతుడే కాని అహింస పరమధర్మమని వాదించి నెగ్గలేకుండా ఉన్నాడు, రెండోవాడు.

సభ బక్కవాడి పక్షం అయిపోతున్నది క్రమంగా.

బలవంతుడి మొహం జేగురించింది. ఆగ్రహం పట్టలేక పోయినాడు. బలహీనుడిమీదికి లంఘించాడు. మెడ రెండు చేతులా పట్టుకొని తోటకూర కాడను ఊపినట్టు ఊపాడు.

బక్కవాడు గుడ్లు తేలవేశాడు. అహింస గెలిచింది.

---